నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
3 | మహబూబ్‌నగర్, ఆదివారం 18 ఆగస్టు 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY

రుణమాఫీ ఏదంటూ నిరసన

- గుమ్మడం రైతువేదిక వద్ద ధర్నా
- ప్రతి రైతుకూ క్రాప్‌లోన్ వర్తింపజేయాలని డిమాండ్

పెబ్బేరు, ఆగస్టు 17 : కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులకు పంట రుణమాఫీ వర్తింపజేయాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. సర్కారు నిర్దేశించిన గడువులోగా తీసుకున్న క్రాప్‌లోన్లు మాఫీ కాకపోవడంతో శనివారం పెబ్బేరు మండలం గుమ్మడం రైతులు నిరసన తెలిపారు. గ్రామంలోని రైతు వేదిక వద్ద ధర్నా చేపట్టి ఏఈవో ప్రశాంత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం రూ.2 లక్షల రుణాలు మాఫీ చేస్తున్నట్లు ప్రకటించినప్పటికీ.. వివిధ బ్యాంకుల ద్వారా తీసుకున్న తమకు మాత్రం కాలేదన్నారు. ఏ ప్రాతిపదికన మాఫీ చేస్తున్నారో అర్థం కావడం లేదని వాపోయారు. పెద్ద ఎత్తున మాఫీ చేస్తున్నట్లు ఆర్భాటంగా ప్రకటనలు చేస్తున్నా.. ఆచరణలో మాత్రం కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని తెలిపారు. తిరకాసు నిబంధనలు ఎత్తేసి అందరికీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతు సంఘం జిల్లా నేత వెంకటస్వామి మాట్లాడుతూ మూడో విడుత రుణ మాఫీలో చాలా మంది పేర్లు రాలేదన్నారు. రేషన్ కార్డుకు సంబంధం లేకుండా మాఫీ ఉంటుందని గతంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారని, కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉందన్నారు. మాఫీ కాక ఆయా బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. సీఎం రేవంత్ వెంటనే స్పందించి అర్హులకు మాఫీ వర్తింపజేయాలని, లేకుంటే రైతులతో కలిసి ఉద్యమాన్ని ప్రారంభిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు ఆంజనేయులు, సత్యంయాదవ్, శ్రీనివాసులు, నాగేశ్, కిషన్‌నాయక్, రవీందర్‌నాయక్, కృష్ణయ్య, బాబు, రాజు తదితరులున్నారు.

గుమ్మడం రైతువేదిక వద్ద నిరసన తెలుపుతున్న అన్నదాతలు

అమరచింత యూనియన్ బ్యాంక్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

షరతులు ఎత్తివేయాలి

- అమరచింత యూబీఐ ఎదుట ఆందోళన

అమరచింత, ఆగస్టు 17: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో తాము ప్రభుత్వం ఏర్పాటు చేస్తే రూ.2లక్షల వరకు రైతులు తీసుకున్న పంటరుణాలుమాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు అనేక షరతులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తుందని పలువురు రైతులు శనివారం రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు రాజన్న మాట్లాడుతూ.. ఏక కాలంలో రైతు రుణమాఫీ చేస్తామన్న ప్రభుత్వం మాట తప్పి మూడు విడుతలుగా రుణమాఫీ చేపట్టినా.. అందులో అనేక షరతులు పెట్టడంతో రూ.యాభై, లక్ష, రెండు లక్షల వరకు రుణాలను తీసుకున్న చాలామంది రైతులు మాఫీ వర్తించక ఆందోళన చెందుతున్నారని.., తక్షణమే షరతులను ఎత్తివేసి రైతులందరికీ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు ప్రసాద్, రైతులు కృష్ణారెడ్డి, ఆంజనేయులు, వాసరెడ్డి, అంజి, మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నంబావి మండలం వెలగొండ గ్రామానికి చెందిన నారెడ్డి చంద్రారెడ్డి.. తన భార్య వినోద పేరిట వీపనగండ్ల ఐవోబీలో రూ.99,913 రుణం తీసుకున్నాడు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ జాబితాలోనూ ఆమె పేరు వచ్చింది. అయితే, వారి ఖాతాలో డబ్బులు మాత్రం జమ కాలేదు. బ్యాంక్ మేనేజర్‌ను సంప్రదిస్తే అకౌంట్ వివరాలను ప్రింట్ తీసి చేతిలో పెట్టి.. ఇక వెళ్లండి అంటూ సెలవిచ్చాడు. ఆ వివరాలతో జిల్లా వ్యవసాయ కార్యాలయానికి చేరుకొని టెక్నికల్ ఏడీఏను కలిసి తన సమస్యను మొరపెట్టుకున్నాడు. ఇప్పటికే ఐదు దఫాలు బ్యాంకు, ఏఈవోల వద్దకు తిరిగానని, ఎక్కడికి వెళ్లినా న్యాయం జరగడం లేదని బోరుమన్నాడు.

టెక్నికల్ ఏడీఏతో మాట్లాడుతున్న రైతు నారెడ్డి చంద్రారెడ్డి

వనపర్తి జిల్లాలో అందిన ఫిర్యాదులు

మండలం	ఫిర్యాదులు
వనపర్తి	683
ఖిల్లాఘణపురం	342
పెద్దమందడి	350
పెబ్బేరు	950
శ్రీరంగాపురం	350
గోపాల్‌పేట	234
రేవల్లి	271
కొత్తకోట	2,294
మదనాపురం	333
ఆత్మకూరు	187
అమరచింత	255
పాన్‌గల్	997
వీపనగండ్ల	575
చిన్నంబావి	408
మొత్తం	**8,229**

రుణమాఫీ అయితేదా?

- మూడు విడుతల్లో వర్తించని పథకం
- అయోమయంలో మాఫీకాని రైతులు
- రైతువేదికలు, బ్యాంకుల వద్ద నిరసనలు
- మళ్లీ దరఖాస్తు చేయాలంటున్న అధికారులు
- ప్రత్యేక సెల్‌కు వెల్లువెత్తుతున్న వినతులు
- వనపర్తి జిల్లాలో 8,229 మంది దరఖాస్తు
- అత్యధికంగా కొత్తకోటలో 2,294 మంది..

వనపర్తి, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీపై రణం మొదలైంది. అర్హత ఉన్నా లబ్ధి చేకూరకపోవడంతో ఆందోళనలకు దారితీస్తున్నది. చెప్పిన ప్రాతిపదిక ఒకటి.. అమలుచేస్తున్నది మరొకటి అన్నట్లుగా సర్కారు తీరు కనిపిస్తున్నది. వనపర్తి జిల్లాలో రుణమాఫీపై రైతులు గుర్రుగా ఉన్నారు. తొలివిడుతలో 27,066 మందికి రూ.145.55 కోట్లు, రెండో విడుతలో 16,527 మందికి రూ.154.58 కోట్లు, మూడో విడుతలో 10,047 మందికి రూ.126.62 కోట్లు మాఫీ అయ్యింది. ఈ క్రమంలో మూడు విడుతల్లో కలిపి 53,640 మంది రైతులకు రూ.426.76 కోట్ల రుణం మాఫీ జరిగిందని ప్రభుత్వం చెబుతున్నది. అయితే, రుణమాఫీలో అనేక పొరపాట్లు ఉండటం.. ఇప్పటివరకు చాలా మంది ఖాతాల్లో డబ్బులు జమ కాకపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. రూ.లక్షలోపు రుణమాఫీ ప్రకటన వెలువడిన వెంటనే జాబితాలో పేరురాని వారంతా బ్యాంకులకు పరుగులు తీశారు. ఇది గమనించిన సర్కార్ వ్యవసాయ శాఖ పరిధిలో ఒక ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. అర్హత ఉన్నా రుణమాఫీ కాని వారు దరఖాస్తు చేసుకోవాలని కాంగ్రెస్ పెద్దలు చెప్పడంతో రైతులు అధికారుల వద్దకు వెళ్తున్నారు. అయితే, ఏఈవోల వద్దకు వెళ్లిన వారు కొద్ది మందే ఉన్నారు. మాఫీ కాని చాలా మంది రైతులు ముందుకు రావడంలేదు. ఇప్పటివరకు ఏఈవోకు 8,229 మంది రైతులు మాఫీ కాలేదని దరఖాస్తు చేసుకున్నారు. కొత్తకోట మండలంలో అత్యధికంగా 2,294 మంది వినతులిచ్చారు. ఇదిలా ఉండగా, మూడో విడతలో రూ.2 లక్షలలోపు రుణం మాఫీ కాలేదంటూ రైతులు అధికారులను ఎక్కడికక్కడ నిలదీస్తున్నారు. రైతువేదికలు, బ్యాంకుల ఎదుట ఆందోళనలకు దిగుతున్నారు. జిల్లాలో దాదాపు మరో 50 వేల మంది రైతులకు మాఫీ రావాల్సి ఉంటుందని అనధికార అంచనా. అయితే, చిన్నచిన్న సమస్యలను యాప్‌ల ద్వారా చూసి రైతులకు ఏఈవోలు భరోసా ఇచ్చే ప్రయత్నంచేశారు. కానీ, ఏఈవోలు కూడా రైతుల సందేహాలకు సమాధానాలివ్వలేక అలసిపోతున్నారు. శాఖాపరమైన పనుల ఒత్తిడి ఉండగా.. అదనంగా ఈ పని తలనొప్పిగా ఉందన్న అభిప్రాయం అధికారుల నుంచి వ్యక్తమవుతున్నది. కొందరైతే ఫోన్లు కూడా ఎత్తడం లేదని రైతులు వాపోతున్నారు.

గందర గోళంగా..

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన రూ.రెండు లక్షల రుణమాఫీకి అనేక తిరకాసులు పెట్టింది. తీసుకున్న రూ.లక్షాయాభై వేల రుణానికి మాఫీ వస్తుందా.. లేదా అని అయోమయంగా ఉన్నది. మాకున్న తెల్లరేషన్‌కార్డులో నలుగురు కుటుంబ సభ్యులకు ఒక్కరికీ రుణమాఫీ వర్తించలేదు. మొత్తం పదేకరాలకు 2018లో యూనియన్ బ్యాంకులో రూ.లక్షాయాభైవేల క్రాప్‌లోను తీసుకొని ఏటా రెన్యువల్ చేస్తూ వచ్చిన.. రెండో విడుత రుణ మాఫీ లిస్టులో మాపేరు వస్తుందని ఆశించినా రాలేదు. నా భార్య పేరు మీద తీసుకున్న రూ.2లక్షల రుణం కూడా మాఫీకాలేదు.

- వాసరెడ్డి, నాగల్‌కడ్మూర్, అమరచింత

ఎదురుచూపులే మిగిలాయి..

రుణమాఫీ కోసం ఏడునెలల నుంచి ఎదురు చూస్తున్నా నేటికీ వర్తించలేదు. యూనియన్ బ్యాంకులో రూ.లక్షాయాభై వేల క్రాప్‌లోన్ తీసుకొని గతేడాది ఆగస్టులో రెన్యువల్ చేశాం. ఇంత వరకు ప్రకటించిన మూడు విడుత లిస్టులో నాదిగానీ.. నా కుటుంబ సభ్యుల పేరు రాలేదు. వ్యవసాయశాఖ, బ్యాంక్ అధికారులను సంప్రదిస్తే రేషన్‌కార్డు లింక్‌తో నలుగురు కుటుంబ సభ్యులు ఉండడంతో సమస్య ఉందని సమాధానం చెబుతున్నారు. నలుగురిలో ఒకరికైనా మాఫీ రావాలి కదా.., మా కాలనీలో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులకు రుణమాఫీ వచ్చింది, కానీ మాకు రాలేదు. ఇకముందైనా వస్తాదా, లేదా అనుమానంగా ఉంది.

- భారిశెట్టి నాగిశెట్టి, అమరచింత

నా బాధ ఎవరికి చెప్పకోవాలి

మాది సాధారణ రైతు కుటుంబం. నాకు ఎకరా పొలం ఉంది. మూడేండ్ల కిందట కొత్తకోట ఎస్‌బీఐలో రూ.40 వేలు పంట రుణం తీసుకున్నా. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో చెప్పినట్లు నా రుణం మాఫీ అయితదని సంతోషపడ్డ. ఎందుకు కాలేదో అర్థం కావడంలేదు. బ్యాంకులో అడిగితే నీపేరు లిస్టులో రాలేదంటున్నారు. వ్యవసాయ శాఖ అధికారుల దగ్గరికి వెళ్తే బ్యాంక్ స్టేట్‌మెంట్, పట్టాదారు పాసుబుక్కు, ఆధార్‌కార్డు తీసుకురమ్మన్నారు. అన్ని పత్రాలు ఇచ్చినా ఫలితం లేదు. ఎప్పుడు అయితదని అడిగితే సరైన సమాధానం ఇస్తలేరు. అయ్యా సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా చిన్నసన్నకారు రైతులకు అండగా నిలిచి రుణాలు మాఫీ చెయ్యండి.

- కృష్ణయ్య, శంకరమ్మ పేట, మదనాపురం మండలం

జూటామాటల కాంగ్రెస్..

రూ.2లక్షల వరకు ఏకకాలంలో రూణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పింది. నాకు ఎకరా 32 గుంటల పొలం ఉన్నది. కొత్తకోట ఎస్‌బీఐలో రూ.లక్షా20వేలు అప్పు తీసుకున్న. రెండో విడుతలో రూ.1.50 లక్షల వరకు మాఫీ చేస్తామని ప్రకటించినా నేను లబ్ధి పొందలేదు. రేవంత్‌రెడ్డి మాటలు నమ్మి ఓట్లేస్తే మంచి గుణపాఠం చెప్పిండు. రైతులను మోసం చేస్తే కాంగ్రెస్‌కు పుట్టగతులుండవు. రైతుల శాపనార్థాలు ప్రభుత్వానికి తగులుతాయి. ఎందుకు గొప్పలు చెప్పుకోవాలి. తూతూమంత్రంగా చేసి చెప్పుకోవడం సిగ్గుచేటు. ఇప్పటికైనా మొద్దునిద్ర వీడి అందరికీ రుణమాఫీ చేయాలి.

- మూలమల్ల యాదగిరిరెడ్డి, దంతనూరు, మదనాపురం మండలం

రైతన్న పరేషన్!

- మాఫీ.. మమ అనిపించారని ఆగ్రహం
- రూ.2 లక్షలు చేశామని ప్రభుత్వ ఆర్భాటం
- మాఫీ కాలేదంటున్న పలువురు రైతులు
- రేషన్‌కార్డు లింక్‌తో కొర్రీలంటూ ఆందోళన
- సర్కారు తీరుపై తీవ్ర అసహనం
- మిన్నకుండిపోయిన కాంగ్రెస్ నేతలు

కల్వకుర్తి, ఆగస్టు 17: రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వం 'మమ' అనేసింది. ఏదైనా తలపెట్టిన కార్యం పూర్తి చేయలేక వెల్లకిల పడితే.. మమ అని సదరు కార్యాన్ని పూర్తి అయ్యిందనిపిస్తారు. మమ అనే పదం రుణమాఫీ విషయంలో రేవంత్ సర్కార్‌కు అతికినట్లు సరిపోతుంది. అధికారంలోకి వచ్చాక 2023 డిసెంబర్ 9న రూ.2లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేస్తామని ఎన్నికల్లో ఊదరగొట్టిన రేవంత్‌రెడ్డి అధికార పీఠం ఎక్కాడు. ఆ తర్వాత మెల్లగా మాట మారుస్తూ మూడు విడుతల్లో, ఆగస్టు 15లోగా రూ.2లక్షల రుణాలను మాఫీ చేస్తానని కనిపించిన దేవుళ్లపై ఒట్లు వేసి కాలం గడిపాడు. తీరా గడువులు రాగానే రుణమాఫీపై కొర్రీలు వేశాడు. రుణమాఫీ చేస్తున్నామని ప్రకటిస్తూనే కొర్రీలకు శ్రీకారం చుట్టాడు. దీంతో సగానికిపైగా రైతులకు రుణమాఫీ అందలేదు. ప్రభుత్వం మాత్రం అర్హులందరికీ రుణమాఫీ చేశామని చెప్పుకుంటోంది. సాంకేతిక సమస్యలతో రుణమాఫీ రానివారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని చావు కబురు చల్లగా చెప్పింది. రుణమాఫీ తీరుపై రైతుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నది. రేవంత్ ప్రభుత్వం రైతులను దారుణంగా వంచించిందని రైతు సంఘం నాయకులు మండిపడుతున్నారు. కేవలం అధికారంలోకి వచ్చేందుకే రుణమాఫీ హామీతో రైతులను కాంగ్రెస్ పార్టీ దారుణంగా మోసం చేసిందని దుయ్యబడుతున్నారు.

రేషన్‌కార్డు ప్రామాణికంగా..

రుణమాఫీ విషయంలో ఆదినుంచి కూడా రేవంత్ సర్కార్ పక్కా ప్రణాళికతోనే ఉన్నది. సభలు, సమావేశాల్లో ముఖ్యమంత్రితోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు రైతులపై ఎనలేని ప్రేమ ఒలకబోస్తూ బ్యాంకుల్లో ఉన్న ప్రతి రైతు పంటరుణాన్ని మాఫీ చేస్తామని ప్రకటనలు చేశారు. రైతుల రుణాలు మాఫీ చేస్తున్నామని జీవో ఇవ్వడంతో క్షీరాభిషేకాలు చేశారు. తీరా రుణాల మాఫీ ప్రకియ ప్రారంభం కావడంతో ప్రభుత్వం అవలంబిస్తున్న కొర్రీలు ఒక్కొక్కటి వెలుగు చూస్తున్నాయి. రుణమాఫీకి ప్రధానంగా రేషన్‌కార్డును మాత్రమే ప్రామాణికంగా చూశారనేది స్పష్టమైంది. కుటుంబంలో ఒక్కరికి మాత్రమే పంట రుణం ఉంటే వారికి మాత్రమే రుణమాఫీ వర్తించిందన్న విషయం రైతులకు చాలా ఆలస్యంగా అర్థమైంది. రుణమాఫీకి అర్హత ఏమిటంటే రేషన్‌కార్డు. అర్హత ఉన్నా రేషన్‌కార్డు లేకపోవడంతో రుణమాఫీ రాలేదు. వ్యవసాయాధికారుల వద్దకు వెళితే.. వారి వద్ద ఉన్న యాప్‌లో కుటుంబ సభ్యుల నిర్ధారణ చేయాల్సి ఉందనే సమాధానం వస్తున్నది.

కల్వకుర్తి పీఏసీసీఎస్‌లో..

కల్వకుర్తి పీఏసీసీఎస్‌లో 137 మంది రైతులకు రూ.1.50 లక్షలకుపైగా రుణాలు ఉన్నాయి. వీరందరి పేర్లను రుణమాఫీకి అర్హులని ఉన్నతాధికారులకు జాబితా పంపించారు. రూ.2లక్షల జాబితాలో కేవలం 24 మంది రుణాలు మాఫీ అయ్యాయి. 113 మంది రైతులకు రుణమాఫీ వర్తించలేదు. ఇదేమని అడిగితే ఎవరి వద్ద పూర్తి సమాచారం లేదు. రుణమాఫీ అనేది అర్థంకాని బ్రహ్మ పదార్థమైంది. రేషన్‌కార్డు కలిగిన కుటుంబంలో ఒకే వ్యక్తికి రూ.2 లక్షల రుణం ఉంటే.. అది మాఫీ అయినట్లు తెలుస్తుంది. అలా కాకుండా రేషన్ కార్డులో ఉన్న సభ్యులకు భూములు ఉండి వారికి రుణాలు రూ.2లక్షలలోగా ఉన్నవారికి రుణమాఫీ కాలేదు. ఇలా రకరకాల కారణాల వల్ల చాలామందికి లబ్ధి కలగలేదు. కల్వకుర్తి మండలం వెంకటాపూర్‌లో రూ.2లక్షల రుణమాఫీకి 50 మంది వరకు అర్హులుంటే ఒక్కరికీ మాత్రమే వర్తించింది. తాండ్రలో కూడా అదే పరిస్థితి. స్వయంగా సీఎం రేవంత్ వంగూర్ మండలం కొండారెడ్డిపల్లిలో 1,413 మంది రైతులు ఉన్నారు. మొదటి, రెండో విడుతలో అంటే రూ.1.50లక్షల వరకు కేవలం 205 మందికి మాత్రమే మాఫీ అయ్యింది. మూడో విడుతలో 15 మందికి వర్తించినట్లు సమాచారం.

కాంగ్రెస్ నేతల గప్‌చుప్..

అర్హులైన వారికి పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో కాంగ్రెస్ నాయకులు గప్‌చుప్ అయ్యారు. ఈ విషయంపై మాట్లాడడానికి మొహం చాటేస్తున్నారు. రుణమాఫీ ఏ మాత్రం సక్కగా ఉన్నా.. ఫొటోలకు పాలు పోసే బ్యాచ్ ఇప్పటికే బయలు దేరేదని రైతు సంఘం నాయకులు చలోక్తులు విసురుతున్నారు. మరికొందరు మాత్రం రుణమాఫీ విషయంలో ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్న క్రమంలో ఏమని ప్రజల్లోకి వెళ్లాలని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఊర్లో సరాసరిన లెక్కిస్తే 40 శాతం రైతులకు మాత్రమే రుణమాఫీ వచ్చిందని వాపోతున్నారు. చివరకు నవ్వినోనిముందే జారిపడ్డట్లు తమ పరిస్థితి తయారైందని ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. రుణమాఫీ పూర్తి స్థాయిలో కావడం లేదని సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అడిగితే బావిలో దూకి చావమని ముఖ్యమంత్రి అనడంపై కాంగ్రెస్ శ్రేణుల్లో నిరసన వ్యక్తమవుతుంది.

రైతుల ఆశలపై నిప్పులు..

చాలామంది రైతులు రైతుబంధుపై ఆశలు పెట్టుకున్నారు. రైతుబంధు ఇవ్వకుండా ప్రభుత్వం రుణమాఫీ ముందేసుకోవడంతో రుణమాఫీపై ఆశలు పెట్టుకున్నారు. రుణమాఫీ కూడా కాకపోవడంతో దిగాలు పడిపోయారు. పెట్టుబడులకు రైతుబంధు లేదు, రుణమాఫీ అయితే కొత్త రుణాలు తీసుకుందామంటే మాఫీ కాలేదు. ఇప్పుడెలా భగవంతుడా అంటూ బాధపడుతున్నారు. రేవంత్ ప్రభుత్వం తమను నిలువునా మోసం చేసిందని రైతులను ఏడిపించిన ఏ ప్రభుత్వం ముందల పడదని శాపనార్థాలు పెడుతున్నారు.

మాఫీపై ఎలాంటి ఆశల్లేవ్..

కాంగ్రెస్ సర్కారు రైతుల రుణమాఫీని మూడు విడుతల్లో చేస్తామని చెప్పింది. క్రాప్‌లోన్ రూ.62వేలు ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన పంట రుణమాఫీ మొదటి విడుత నుంచి ఎదురుచూస్తున్నా.. మూడు విడతలైనా మాఫీ కాలేదు. బ్యాంకు చుట్టూ తిరిగిన ప్రయోజనం లేకుండా పోయింది. బ్యాంక్, వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యంతో నాకు రుణమాఫీ కాలేదు. నాతోపాటు నాలాంటి ఎంతోమంది పేద రైతులు ఇలానే ఇబ్బందులు పడుతున్నారు. రుణమాఫీపై ఆశలు పోయాయి.

- తెలుగు నర్సింహ, రైతు, బెక్కెం, చిన్నంబావి మండలం

ఒక్కరికి కూడా కాలేదు..

నా పేరు మీద మూడెకరాల పొలం ఉన్నది. వనపర్తి యూనియన్ బ్యాంకులో రూ.1.20 లక్షల పంటరుణం తీసుకున్నం. నా భర్త రూప్లా నాయక్ పేరు మీద ఉన్న భూమిపై కూడా రూ.1.20 లక్షల రుణం ఉన్నది. అయితే, కాంగ్రెస్ ప్రకటించిన రుణమాఫీ కింద మా ఇద్దరిలో ఒక్కరికి కూడా లబ్ధి చేకూరలేదు. కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నాం. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇక్కడికి పోతే అక్కడికి.. అక్కడికి పోతే ఇక్కడికి అంటూ కాలయాపన చేస్తున్నారు. ఏఈవోలు ఫోన్ ఎత్తడం లేదు. లాభం లేదనుకొని చివరకు కలెక్టరేట్‌కు వచ్చిన. కాంగ్రెసోళ్ల ప్రచారం చూస్తే పెద్దగా ఉంది.. కింది స్థాయిలో చూస్తే ఏమీ లేదు. గిరిజన రైతులమైన మాకే మాఫీ కాకుంటే ఎలా. ఏం చేయాలో అర్థం కావడం లేదు. మాకు న్యాయం జరిగేలా చూడండి.

- ఇస్లావత్ భాగ్యలక్ష్మి, పెద్దగూడెం తండా, వనపర్తి మండలం

మహబూబ్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, ప్రభుత్వ మెడికల్ విద్యార్థులు

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనకు నిరసనగా వైద్యులు రోడ్డెక్కారు. శనివారం ఉమ్మడి పాలమూరులోని అన్ని జిల్లా కేంద్రాల్లో విధులు బహిష్కరించి ర్యాలీలు, ధర్నాలు కొనసాగించారు. మహిళలపై జరుగుతున్న దాడులపై పాలమూరు తెలంగాణ చౌరస్తాలో ప్రభుత్వ వైద్య విద్యార్థులు నాటక ప్రదర్శన చేశారు. మహిళా డాక్టర్ మృతికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని నినదించారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, మహిళలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. దవాఖానల్లో ఓపీ సేవలు నిలిచిపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అత్యవసర సేవలు మాత్రమే కొనసాగాయి.

- నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, ఆగస్టు 17

ర్యాలంపాడు రిజర్వాయర్ సందర్శన

ధరూరు, ఆగస్టు 17 : ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా మండలంలోని నెట్టెంపాడు ఎత్తిపోతల ఫేజ్-2 ర్యాలంపాడు రిజర్వాయర్‌ను ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గద్వాల ఎమ్మెల్యే కృష్ణ మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ ఇన్‌చార్జి సరితతో కలిసి శనివారం సందర్శించారు. రిజర్వాయర్ నీటిమట్టాన్ని పరిశీలించి నీటి విడుదల, ఆయకట్టు, లీకేజీ విషయమై ఈడీ రహీముద్దీన్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తిరుపతయ్య, సుదర్శన్‌రెడ్డి, శ్రీరాములు, శ్రీనివాసులు, వెంకట్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, రవి, మధుసూదన్‌బాబు, రాజశేఖర్‌రెడ్డి, నాగిరెడ్డి, దౌలన్న తదితరులున్నారు.

అధికారులకు సూచనలిస్తున్న మంత్రి జూపల్లి

వైన్స్ నిర్వాహకుల దాడి

- మూసాపేటలో యువకుడిని కొట్టిన వైనం
- 100 నెంబర్‌కు డయల్ చేసిన బాధితులు

మూసాపేట, ఆగస్టు 17 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బండమీదిపల్లి వద్ద మల్లికార్జున వైన్స్ షాపు నిర్వాహకులు దాడిచేసి ఓ యువకుడిని హత్య చేసిన ఘటన మరువకముందే.. మూసాపేట మండలకేంద్రంలోని కార్తీక్ వైన్స్ షాపు నిర్వాహకులు మరో యువకుడిపై దాడికి పాల్పడిన ఘటన శనివారం చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. మూసాపేటలోని బంగ్లాగడ్డకు చెందిన జనార్దన్ తోపాటు ముగ్గురు యువకులు కార్తీక్ వైన్స్‌లో బీర్లు తీసుకొని పర్మిట్ రూంకు వెళ్లారు. చికెన్ ఆర్డర్ చేసి డబ్బులు చెల్లించారు. బీర్లు తాగడం అయిపోతున్నా చికెన్ రాలేదు. దీంతో యువకుడిని పిలిచినా స్పందన లేకపోవడంతో పక్కనున్న ఖాళీ సీసాతో డబ్బాకు కొట్టి పిలిచారు. సీసా ఎందుకు విసిరారని వైన్స్ నిర్వాహకులు వచ్చి చంద్రశేఖర్‌పై దాడికి పాల్పడ్డారు. చుట్టుపక్కల వారు చెప్పినా వినకుండా రోడ్డువెంట దాడిచేస్తూ తీసుకెళ్లారు. మిగతా వారు వెంటనే 100కు డయల్ చేశారు. మూసాపేట పోలీసులు రావడంతో వైన్స్ నిర్వాహకులు యువకుడిని వదిలేశారు. పోలీసులు వారందరినీ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు సకాలంలో చేరుకోకపోతే మరో ప్రమాదం జరిగేదని, దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా దాడికి పాల్పడ్డవారు కూడా మద్యం తాగడంతో గొడవ చోటుచేసుకున్నదని తెలిపారు.

యువకుడిపై దాడిచేస్తున్న వైన్స్ నిర్వాహకులు